క్లుప్తంగా

తాగునీరు సమస్య లేకుండా చర్యలు



సేతుభీమవరంలో పైపులైన్‌ను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

జి.సిగడాం: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం సేతు భీమవరంలో తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్లు పాడైనట్లు సమాచారం అందిన వెంటనే 24 గంటల్లో బాగు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి పంచాయతీలో జనాభా ఆధారంగా తాగునీటి బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పల్లెకు జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిబాబు, బోరు మెకానిక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వారం వ్యవధిలోనే మొక్కజొన్న చెల్లింపులు



రికార్డులు పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్

రణస్థలం: రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన వారం రోజుల్లో నగదు జమ చేస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండ్య తెలిపారు. రణస్థలం-1 రైతు భరోసా కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమశాతం పరిశీలించి రైతుల నుంచి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.1962 అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, జిల్లా మార్క్‌ఫెడ్ ఎండీ రమణి, ఏఓ డి.విజయభాస్కర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాంలోని సత్యసాయి మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ముందుగా సాయిగణేష్ విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. హోమాలు, నగర సంకీర్తన, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సత్యసాయి యువత, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



గోవింద కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కొచ్చెర్ల పంచాయతీ కొమరవానిపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కోనేటి గోవింద బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ఎచ్చెర్ల ఏఎంసీ వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, నాయకులు మూగి సన్యాసి, కోనేటి అప్పలరాజు, తోడ దానేషు, మూగి సత్యం, కొమర పోలరాజు, మూగి అప్పన్న, బస్వ దుర్గారెడ్డి ఉన్నారు.

• దేరసాంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దన్నాన అప్పన్న అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు దేరసాం సర్పంచ్ మీసాల రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, దన్నాన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఫిషింగ్ హార్బర్‌తో..
జీవన ప్రమాణాల్లో మార్పు



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

• గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో జీవన ప్రమాణాలు మారనున్నాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుడగట్లపాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్లలో వర్తించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బ్రోచర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వలసల నిర్మూలనే ధ్యేయంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. దీనిలో భాగంగానే బుడగుట్లపాలెంలో రూ.361.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. 780 బోట్లు నిలిపేందుకు అనువైన హార్బర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. 18 నెలల్లో పోర్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. స్థానిక మత్స్యకారులకు వేట సామర్థ్యం పెరుగుతుందని, ఫిష్ మార్కెటింగ్ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల మత్స్యకార గ్రామాలకు హార్బర్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో అర్హులందరికీ ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, మండల వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, నాయకులు, ప్రజా ప్రతినిధులు బెండు రామారావు, బగ్గు రాజారావు, అంబటి రాంబాబు, మడ్డు లక్ష్మణరావు, వాసుపల్లి అప్పారావు, సూరాడ రాము, గోపిల రాంబాబు, చీకటి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు



వివరాలు వెల్లడిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు తీసుకువెళ్లటం లక్ష్యంగా ఈ నెల 15 నుంచి పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి చెప్పారు. ఫరీదుపేటలో తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా మహిళలకు వర్తిస్తున్న ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థలో చేరిన కుశాలపురం, తోటపాలెం మినహా 26 పంచాయతీల్లో ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో మొదటి విడతతో 37 సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఐదు విడతల్లో 187 సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 15న ఫరీదుపేటలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, మండల విప్ బగ్గు రాజారావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను రక్తదానం కాపాడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు అన్నారు. రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల 120 రోజుల్లో కొత్త రక్తం వస్తుందని, అనేక వ్యాధులు నయమవుతాయని వివరించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ రక్తదానానికి యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏఓఎల్ జిల్లా కో-ఆర్డినేటర్ నంబాళ్ల కల్పన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త గొండు శంకర్, సీనియర్ సభ్యులు ఎస్‌వీఏ పోలినాయుడు, ఏఓఎల్ డీడీసీ సభ్యులు వరదా వెంకట్ ఆనంద్, బి.వి.రవిశంకర్, శిల్లా రమేష్, ప్రశాంతి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, పీఆర్వో పెంకి చైతన్య, కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి ఉత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: వాడాడ గ్రామంలో శ్రీ తరిణికృష్ణ స్మారక ధార్మిక ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ప్రతినిధులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం 6గంటలకు శాస్త్రీయ సంగీత కచేరీ, భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని హనుమాన్ విగ్రహానికి విశేష పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మండా శ్రీనివాసరావు, మండా వెంకట రమణమూర్తి, గణేష్, కామేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: గుజరాతిపేటలోని జగన్నాథ స్వామి ఆలయంలో శనివారం ఉదయం 9.24 గంటలకు సీతారామ లక్ష్మణులు, హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సిపాయి అదృశ్యంపై కేసు నమోదు



బాలకృష్ణ

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని హడ్కో కాలనీకి చెందిన ఆర్మీ సిపాయి సెలవులకని వచ్చి తిరిగి విధుల్లోకి చేరుతానంటూ వెళ్లి.. అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. హడ్కో కాలనీకి చెంది సీమల బాలకృష్ణ (26) ఆర్మీ మద్రాసు రెజ్మెంట్‌లో 2018లో చేరాడు. ప్రస్తుతం మేఘాలయా రాష్ట్రంలో సిపాయిగా పోస్టింగ్‌లో ఉన్నాడు. రెండు నెలల సెలవుకని మార్చి 11న ఇంటికొచ్చాడు. తిరిగి ఈ నెల 10న ఇంటి నుంచి ఉదయం పది గంటలకు బయలుదేరి వెళ్లాడు. అప్పటి నుంచి నాలుగు రోజులుగా తండ్రి చిరంజీవులు, కుటుంబసభ్యులు ఫోన్ చేస్తున్నా కావడం లేదు. కుమారుడు ఇంకా విధుల్లోకి చేరలేదంటూ రెజ్మెంట్ నుంచి ఫోన్ రావడంతో ఆందోళనకు గురైన తండ్రి రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవం సందర్భంగా నగరంలోని డాక్టర్ ముద్దాడ చిన్నబాబు ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం నుంచి మజ్జిగ ఉపశమనం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎన్.కల్పన, ఏఓఎల్ డీడీసీ సభ్యులు వరదా వెంకట్ ఆనంద్, బి.వి.రవిశంకర్, ఎస్‌వీఏ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవా పథకానికి విరాళాలు



నగదు, బియ్యం అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రాస్పత్రి(రిమ్స్)లో నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ సేవా పథకానికి నరసన్నపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కర్ర చిన్న జగ్గునాయుడు కుమారుని పెళ్లి రోజు సందర్భంగా రూ.10 వేలు, ఆమదాలవలసకు చెందిన విశ్రాంత సైనికాధికారి వాడ భూపతిరాజు కుమారుడు రాహుల్ సాయి పుట్టినరోజు సందర్భంగా రూ.3వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ అన్నపూర్ణ సేవ ఉపాధ్యక్షుడు సూర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవత సంబరాలు



విద్యుత్ అలంకరణలో వసప

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలో చెవిటమ్మ తల్లి అమ్మవారి పండగలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి పండగలు నిర్వహిస్తారు. గ్రామంలో తొమ్మిది రోజులు నిర్వహించే పండగలు ఈ నెల 16 తేదీ సిరు మానోత్సవం ఉంటుంది. పండగల సందర్భంగా మొక్కులు చెల్లించిన అనంతరం.. 17న గ్రామంలో భారీ స్థాయిలో విందులు ఏర్పాటుతో పండగలు ముగియనున్నాయి. తొమ్మిది రోజులపాటు గ్రామంలో పలు సాంస్కృతి కార్యక్రమాలతోపాటు పౌరాణిక నాటక ప్రదర్శనులు నిర్వహిస్తున్నారు. గ్రామ దేవతలు ముగ్గురాటలతో చల్లదనం చేస్తూ ప్రతీరోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పండగలు పురస్కరించుకుని గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వలస వెళ్లిన కుంటుంబాలతోపాటు ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు గ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది.

క్రికెట్ టోర్నీ విజేతగా అయ్యవారిపేట



విజేత జట్టుకు అవార్డులు అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామంలో వారం రోజులుగా నిర్వహించిన శేపాన ప్రకాశరావు స్మారక క్రికెట్ టోర్నీ విజేతగా అయ్యవారిపేట జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్ శనివారం జరిగింది. తోటవాడ అంబేడ్కర్ జట్టుపై అయ్యవారిపేట జట్టు విజయం సాధించింది. విన్నర్ టీమ్‌కు రూ.5 వేలు, ట్రోఫీ, రన్నర్ టీమ్‌కు రూ.2 వేలు, ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల సచివాలయ కమిటీ కన్వీనర్ల కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, బూర్జ మండల జనసేన పార్టీ కన్వీనర్ కె.నాగేంద్ర అందజేశారు. నిర్వాహకులు శేపాన సాయికుమార్, రాజేష్, స్వరూప్, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న హెచ్‌ఎం సూర్యనారాయణ



ఎచ్చెర్ల క్యాంపస్: వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

రణస్థలం: విద్యార్థులకు పుస్తక పఠనం సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం దినపత్రికలు, కథలు చదివించడం, రాయించడం, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాల్లో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కరిమజ్జి భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దినపత్రికలు చదవాలి

లావేరు: విద్యార్థులు దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని రిసోర్సు పర్సన్ రాంబాబు, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మురపాక, లావేరు శాఖా గ్రంథాలయాల్లో దినపత్రికల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాఠ్య పుస్తకాలతో పాటు దినపత్రికలు కూడా తప్పనిసరిగా చదవాలన్నారు.

మాతృభాషే గొప్పది

ఎచ్చెర్ల : ఏదైనా సమస్య వస్తే మొదట మాతృభాషలోనే చెప్పగలమని ధర్మవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శిమ్మ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మాతృభాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

సమకాలీన అంశాలు తెలుసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వార్తా పత్రికలు చదవటం వల్ల ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుస్తుందని, సమకాలీన అంశాలపై అవగాహన పెరుగుతుందని ఎచ్చెర్ల గ్రంథాలయాధికారి నీలమ్మ అన్నారు. ఎచ్చెర్ల గ్రంథాలయంలో వార్తా పత్రికలు చదవటంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామారావు పాల్గొన్నారు.

పఠనం తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, తరగతి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని సంపాదించాలని ఉపాధ్యాయులు సాయికృష్ణ, ఎస్.ఈశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పఠనావశ్యకతను వివరించారు. కార్యక్రమంలో టి.రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: అవగాహన కల్పిస్తున్న సాయికృష్ణ



రణస్థలం: స్పోకెన్ ఇంగ్లీష్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు భాస్కరరావు



లావేరు: దినపత్రిక చదువుతున్న చిన్నారి

కలప అక్రమ రవాణా!



వాహనాల ద్వారా డిపోలకు తరలిపోతున్న కలప

ఆమదాలవలస రూరల్: మండలంలో కలప రవాణా అక్రమంగా సాగుతోంది. కలపను టింబర్ డిపోలకు తరలించాలంటే అటవీ, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా వాహనాల ద్వారా డిపోలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. టింబర్ డిపోలకు చెందిన యజమానులు గ్రామాల్లో తక్కువ ధరకు కలపను కొనుగోలు చేసి వాటికి ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తరలించడం చర్చణీయంగా మారుతుంది. గ్రామాల్లో చిన్నపాటి అవసరాల కోసం కలపను వ్యాన్‌ల ద్వారా తరలిస్తే వాటిని అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా డిపోలకు తరలిస్తున్న కలపను అధికారులు ఎందుకు సీజ్ చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కలప రవాణాతోపాటు గ్రామాల్లో ప్రభుత్వ రోడ్డుకు అనుకుని ఉన్న స్థలాల్లో ఉన్న చెట్లను సైతం యంత్రాల ద్వారా ముక్కలు చేసి వాటిని డిపోలకు తరలించుకుపోతున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న అక్రమ కలపను పట్టుకోవాలంటే పట్టణాల్లో ఉన్న డిపోలపై అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తే బయటపడుతుందని గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. నాగావళి నదీ పరివాహక ప్రాంతమైన ముద్దాడపేట, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, దూసి పరిసర ప్రాంతాల్లో నదీ తీరంలో ఉన్న చెట్లను కొందరు అక్రమంగా నరికివేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. నదీతీరంలో ఉన్న చెట్లు నరికివేయడం వల్ల వర్షాకాలంలో వచ్చే వరదలు గ్రామాల్లోకి వస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. వరదలు గ్రామాల్లోకి రాకుండా చెట్లు కొంత వరకు రక్షణగా ఉంటున్నా వాటిని ఇటుక బట్టీల కోసం నరికివేస్తున్నారని చెబుతున్నారు. వీటిపై రెవిన్యూ అధికారులు దృష్టి సారించి, చెట్లు నరికివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

ఘనంగా చక్రధరస్వామి వైశాఖిహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధరస్వామికి వైశాఖహోమం ఉత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. లోకకల్యాణార్థం రైతులు, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సస్యశ్యామలంగా పాడిపంటలతో సమాజ క్షేమాన్ని కోరుతూ వైశాఖమాసం చివరి శనివారం ఈ హోమాన్ని భక్తిశ్రద్ధలతో చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అనువంశికధర్మకర్తలు పి.కృష్ణారావు, పి.శ్రీరాంబాబు, పి.అనసూయమ్మల ఆధ్వర్యంలో ఒడిశాకు చెందిన వేద పండితులచే హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు వేకువజామున శ్రీదేవీ, భూదేవీసమేత చక్రధరపెరుమాళ్లస్వామికి సుప్రభాతసేవ, నిత్య దర్శనాలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైశాఖ హోమం పూర్ణాహుతి ప్రసాదాన్ని భక్తులకు అందించారు.